బంగారు జ్ఞాపకాలు

సుబ్బారావు కంభంపాటి

యె దౌలత్ భీ లే లో, యె షహ్రత్ భీ లే లో
భలే ఛీన్ లో ముఝ్సే మేరీ జవానీ
మగర్ ముఝ్కో లౌటాదో బచ్పన్ కి యాదేన్
వో కాగజ్ కి కష్తీ, వో బారిష్ కి పానీ

వీర్రాజు స్కూలికి నేను వెళ్ళింది 1969 నించి 1976 వరకు మాత్రమే అయినా, ఆ బళ్ళో యెన్నో దశాబ్దాలు గడిపినట్లనిపిస్తుంది, అప్పుడప్పుడు నాకు. 1969 లో నేను ఆంజనేయస్వామి వెనక్కాలుండే నంబరు 6 స్కూల్లో నాలుగవ తరగతి చదివేవాడిని (ఆబడి కోసం మైనురోడ్డంతా వెతికారు కనక – ఇప్పుడు ఆబడిని పడగొట్టి మిఠాయి కొట్లు పెట్టారు లెండి). నేనెదో సరిగ్గా చదవడం లెదని అనుమానించి మా నాన్నగారు నన్ను వీర్రాజు బళ్ళో చేర్పించారు. (అప్పడిలో ప్రాధమిక బడి ఉపాధ్యాయులకి ట్రైనింగు ఇచ్చే సెంటరు ఉండేది వీర్రాజు స్కూల్లో. ఆప్రోగ్రాములో చదివి T.S.L.C. డిగ్రీ సంపాదిస్తే చిన్న స్కూళ్ళళ్ళో మాస్టర్లు గా చెరవచ్చుననమాట.)

ఒక విధంగా చూస్తే ఆంజనేయస్వామి బడినించి వీర్రాజు స్కూలుకి రావడం కట్టమూరు నించి బొంబాయికి కాపురం మార్చడంలాంటిదన్నమాట. ఆంజనేయస్వామి బళ్ళో పరీక్షలు అవీ పెట్టి పిల్లల్ని హింసించడంలాంటి కార్యకలాపాలు కొంచెం తక్కువ ఉండేవి. కానీ వీర్రాజు స్కూల్లో చెరినప్పటిడినించీ ఒహటే హడావిడి – ఇదిగో స్లిప్పుటెస్టులు, అదిగో క్వార్టర్లీలు అంటో.

నాలుగవ తరగతి వాళ్ళమంతా కలిసి స్కూలు మేడమీద మధ్య భాగంలో కూర్చొనేవాళ్ళం. మేడమీద ఏక్లాసుకీ బెంచీలు ఉండేవి కాదు. అందువల్ల అంతా నేలమీడ కూర్చొనేవాళ్ళం. వీర్రాఘవరావు మాస్టారు మాకు క్లాసు టీచరు; చెక్కా వీరభద్రరావు అనే అబ్బాయి మాకు క్లాసు లీడరు. నాలుగవ, అయిదవ తరగతి పిల్లలకి ట్రైనింగు వాళ్ళు అప్పుడప్పుడు పాఠాలు చెప్పేవారు– రకరకాల మ్యాపులు, బొమ్మలతో సైతం. అవి మంచి భలేగా ఉండేవి (నేను ఆరవ తరగతికి వచ్చేటప్పడికి ఆట్రైనింగు ప్రోగ్రాము మెత్తేసారు).

ప్రతి సోమవారమూ ప్రొద్దున్న స్కూలు ఏసెంబ్లీ ఉండేది. ఏసెంబ్లీ అంటే పిల్లలమంతా స్కూలు గ్రౌండులో మహాభారత యుద్ధంలో అక్షౌహిణుల్లాగ వేరే వేరే క్లాసు గుంపులుగా నుంచుని, హెడ్మాస్టారు బోధించిన విషయాలు వినడం అనమాట. అడపాదడపా కొంతమంది పిల్లలు కూడా తమతమ వాగ్ధాటిని ప్రదర్శించేవారు. ఇదిగాక, మంగళవారాలు సామంత్రం స్కూలు విడిచాక మ్యాసుడ్రిల్లు ఉండేది. స్టీవెన్సన్ మాస్టారు, నూలు మాస్టారు ఒక పేద్ద బల్లమీదకెక్కి మమ్మల్నందరినీ డ్రిల్లు చేయించేవారు. మంచి తమాషాగా ఉండేది.

ఆరోజుల్లో స్కూలుడే బోల్డు ఆర్భాటంగా చేసేవారు. స్కూలు గ్రౌండులో వేదిక వేసి, సాయంత్రం దీపాలవేళకి కార్యక్రమం మొదలుపెట్టేవారు. బహుమతులు పంచడంతో ప్రారంభించినది, చిన్న చిన్న ఏకపాత్రాభినయాలతోను, హాస్య కధానికలతోను, ఒక పెద్ద నాటకముతోను కలిపి దగ్గిర దగ్గిర పది అయ్యేవరకూ జరిగేవి వేడుకలు. స్కూలువాళ్ళే కాక ఊళ్ళోవాళ్ళూ బోల్డుమంది వచ్చేవారు. ఓసారి జయరామయ్య మాస్టారు వేయించిన "అబద్ధ హరిశ్చంద్ర" అన్న నాటకంలో నాకో చిన్న పాత్ర కూడా ఇచ్చారు. ఓరాత్రివేళ బిక్కుబిక్కుమంటో నాటకం రిహార్సలుకి వెళ్ళేవాళ్ళం (స్కూలు స్మశానాల దగ్గిర కదా– అంచేత మేగాలిదెయ్యంవచ్చి ఎక్కడ పట్టేసుకుంటుందో అని భయం అన్నమాట). అల్లాగే ఇంకోసారి డ్రాయింగు మాస్టారు వేయించిన "పల్నాటియుద్ధం" బుర్రకథలో రాజకీయం చెప్పాను.

స్కూలుడే కి ఓనెల రోజులముందర్నించి బోల్డు సందడి గా ఉండేది – రకరకాల సాంస్కృతిక పోటీలతోనూ, ఆటలపోటీలతోనూను. వ్యాసరచనల్లోనూ, పద్యాలు భట్టీపట్టి వప్పజెప్పడంలోనూ బహుమానాలు బోల్డు వచ్చినా, ఆటల్లో మాత్రం నాకు చచ్చినా ఒక్క బహుమానం వచ్చేది కాదు.

స్వతంత్ర దినం ఒకటి మళ్ళా హంగామాగా చేసేవారు. నాకు బాగా గుర్తున్నది క్లాసు అలంకరణ పోటీలు. అంటే ప్రతి క్లాసు లోను, పిల్లలంతా కూడుకొని, కొన్ని డబ్బులు వసూలుచేసి, నీలిమందు, వెల్లసున్నం, ముచ్చిరేకుల కాగితాలు, రంగు కాగితాలు – ఇలాంటి సరంజామా కొని, క్లాసు నీ అలంకరించడం అనమాట. స్వతంత్రదినం నాడు ఏసెంబ్లీ అయ్యాక, ముఖ్య అతిధి క్లాసులన్నీ తిరిగి అన్నిటికన్నా అందంగా అలంకరించబడ్డ క్లాసుకి "బహుమానం" ఇచ్చేవారు. ప్రతీ మేడాదీ తొమ్మిదవ, పదవ తరగతి వాళ్ళే నెగ్గేవారు అనుకోండి. అయినా, ప్రతీ యేడాదీ, పట్టువదలని జూనియరు విక్రమార్కుల్లాగా మేము ఒళ్ళు హూనం చేసుకొని క్లాసు నీ అలంకరించేవాళ్ళం–ప్రైజు వస్తుందేమోనన్న ఆశతో. నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు, 25వ స్వంతంత్ర దినం చాలా భారీగా జరిపారు దేశం నిండా. అప్పుడు చివరి సారిగా పెద్దమెత్తున ప్రయత్నించాము పోటీ గెలవడానికి. బహుమానం వచ్చినట్లు గుర్తు లేదు కాని, పెద్ద ఫ్లూ జ్వరం వచ్చినట్టు మాత్రం జ్ఞాపకం.

ఈ మధ్యకాలంలో నేను స్కూలుని చూడ్డానికి వెళ్ళినప్పుడు స్కూలు గ్రౌండులు ఎంతచిన్నవిసుమీ అని చెప్పి (నిరా)శ్చర్యపడిపోమేస్తోంటాను. నేనక్కడ చదివేటప్పుడు గ్రౌండులో ఒక చివర నుంచుంటే రెండోచివర అస్సలు (నా) కంటికి ఆనేదే కాదు! డ్రిల్లుమాస్టారికి బాగా కోపం వస్తే మమ్మల్ని గ్రౌండు ఒక చివర్నించి ఇంకొకచివరికి పరుగెత్తించేవారు – ప్రాణాలార్చుకుపోమేవి మాకు. అప్పుడప్పుడు గ్రౌండు చివర తుప్పలదగ్గర నుంచుంటే లీలగా రైలుబండి కూత వినబడేది – ద్వారపూడి లైనుది కామోసు. ఆతుప్పల్లో పచ్చిరేగిపళ్ళు కుప్పలు కుప్పలుగా ఉండేవి. ఇంటెర్వెల్లులో అక్కడ రేగిపళ్ళు తినడం ఒక ఆనవాయితీ మాకు. ప్రస్తుతానికి ఆగ్రౌండు కొంచెం కుదించుకుపోతేనేమి, నా స్మృతిపధంలో మాత్రం అదోలాల్బహద్దూరు స్టేడియానికి బాబులా విస్తీర్ణంగా నిలిచి ఉంది (దాని పక్కనే ప్రపంచంలో

అన్ని కొండలకంతా పెద్దదయిన కొండగా పాండవులమెట్ట నిలిచునిఉందిలెండి).

వర్షాకాలపు రోజులు మంచిభలేగాఉండేవి. పెద్దగా వర్షం పడుతోంటే, స్కూలుని "కంటిన్యువస్సెషన్" గా మార్చేసేవారు. అంటే, ఒంటిగంటకి ఇంటికివెళ్ళి రొండు గంటలకి మళ్ళా వెనక్కి రావడానికి బదులు సరాసరి రొండుగంటలవరకూ క్లాసులు నడిపేసి ఇళ్ళకి పంపేశేవారనమాట. మొత్తానికి ఒక గంటమాత్రమే క్లాస్సులు తగ్గినా, మా ప్రాణాలకదో గొప్ప వరం లాగ ఉండేది. ఒక్కొక్కప్పుడు మా అద్రుష్టం అంత బాగా లేకపోతే, పన్నెండున్నరవరకు వర్షం పడి, సరిగ్గా కంటిన్యువస్సెషన్ చేస్తారేమో అని ఉబలాటపడుతోన్న సమయంలో వాన వెలిసేసేది. చిర్రెత్తిపోయేది అప్పుడు మాకు.

ఒకసారి ఇలాగే పొద్దున్న సమయంలో వాన పడుతోంది పెద్దగా ఉరుములతోను మెరుపులతోనున్నూ. ఒపక్కన భయంభయంగా "అర్జునా, ఫాల్గుణా, కిరీటా, పిడుగు మామీద పడకుండా చూడు నాయనా" అని అర్జునుణ్ణి దేవిరిస్తూ, ఇంకొక పక్కన వాన వెలవకుండా చెయ్యి దేవుడా అని పెద్దదేవుణ్ణి ప్రార్ధిస్తో కూర్చుని ఉన్నాం. ఇంతట్లో భూమి బద్దలైనంత శబ్దంతో ఒక ఉరుము పడింది గ్రౌండులో ఫూట్బాలు గోలుపోస్టుమీద. హడిలిచచ్చాం మేమందరమూ. వర్షం తగ్గినతరువాత మాస్టారి మాటల్ని లెక్క చెయ్యకుండా అందరం తండోపతండాలుగా వెళ్ళిచూశాం బొగ్గులా కాలిపోయిన ఆగోలుపోస్టుని. (అన్నట్టు అప్పుడే ఓఅబ్బాయి ఒహరహశ్యం చెప్పాడు నాకు – అదే పిడుగు ఆవు పేడమీద పడితే తంగున బంగారము అయ్యిఉండునట! మామూలుగా అస్తామాటూ గ్రౌండునిండా బోల్డు ఆవులు తిరుగుతోనేఉండేవి కానీ, ఆసమయానికి ఒక్క ఆవూ లేదు మా దురద్రుష్టవశాత్తూ.)

నాలుగునుంచి యేడు వరకూ స్కూలి పరీక్షలతో సరిపెట్టి, కొట్టుకొచ్చేశాం, కానీ, యేడవతరగతికి జిల్లా మొత్తం కలిపి పరీక్షలుండేవి. నెమ్మదిగా పరీక్షల భయం మొదలయ్యింది మా అందరికీ. భట్టీ పడదామా వద్దా అని తికమకపడుతోండగా, హఠాత్తుగా "జై ఆంధ్ర" సమ్మె ప్రారంభమయ్యింది. చిలికి చిలికి గాలి వాన అయ్యి ఆ సమ్మె దాదాపు ఆరేడు నెలలవరకూ స్కూళ్ళు మూయించేసింది. మొదట్లో మేమంతా ముస్తాబు అయ్యి స్కూలికి వెళ్ళడం, కాలెజీ వాళ్ళు, లూథెరన్ స్కూలు వాళ్ళూ (వాళ్ళంతా ఓపేద్ద రౌడీల్లెండి) వచ్చి మమ్మల్ని క్లాసులనించి బయటకు తరిమెయ్యడం అదీ జరిగేవి. చివర్లో మాకూ, రౌడీలకీ కూడా ఈ దినదిన భాగోతం విసుగెట్టి, మొత్తం అందరం స్కూళ్ళకి వెళ్ళడం మానేశాం. సమ్మె అయిన తరువాత స్కూళ్ళు మొదలుపెట్టినా, జిల్లా పరీక్షలు రద్దు చేసేశారు, మా మీద ప్రగాఢప్రేమతో. ఆవిధంగా యేడవతరగతి కొట్టించేశాం. యెనిమిదవ తరగతిలో పడినదగ్గరనించి పదవ తరగతి పరీక్షలకు తయ్యారవ్వడమూ, కాంపోజిట్టు లెక్కల్ని వల్లెవేయడమూ లాంటి లౌకికవిషయాల్లో పడి, చింతల్లేని చిన్నతనానికి నెమ్మదిగా వీడ్కోలు ఇవ్వడం ప్రారంభించాము.

ఒక్కొక్కప్పుడు నాకనిపిస్తోంటుంది – నాకు వీర్రాజు స్కూలిమీద ఇంత ఆపేక్ష యెందుకా అని. మా స్కూలికి తలుపుల్లేవు, సరైన బెంచీలూ లేవు, ప్రయోగశాలలో యెక్కువ పరీక్షనాళికలూ లేవు. అయితేనేమిటి, మా బాల్యాన్ని

కొల్లగొట్టకుండా, తిమ్యని అనుభవాలతో కలిపి మెత్తగా చదువు చెప్పింది మాకాబడి. కలతలులేని నా చిన్నతనపుటానందం అక్కడ చదివిన రోజుల్లో పరాకాష్టనందుకొందనిపిస్తుంది నాకు. అందుకే కామోసు, ఆ బడి బంగారు జ్ఞాపకాలు, చలికాలంలో బడి ముందర రాలిఉండే నాగమల్లిపూల సున్నితసువాసనలమల్లే నా మనస్సుని ఆహ్లాదపరుస్తొంటాయి, అడపాదడపా.

మేడంటే మేడా కాదూ,
గూడంటే గూడూ కాదూ,
పదిలంగా అల్లూకున్నా
పొదరిల్లు మాదీ, పొదరిల్లూ మాది